క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నేడు


కోన రామారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు

పరవాడ: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఆయనతోపాటు పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల పార్టీ అనుబంధ విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మండల వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ముఖ్య నాయకులు హాజరుకావాల్సిందిగా కోరారు.

అప్పన్న సన్నిధిలో టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్


ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌కి అప్పన్న చిత్రపటం అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఏపీ టిడ్కో చెర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు.

అంగన్‌వాడీలకు శిక్షణ


శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెందుర్తి: పోషణ భీ.. పడాయి భీ తొలి విడత శిక్షణ కార్యక్రమాలు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం ప్రారంభమయ్యాయి. 3 నుంచి 6 ఏళ్ల వయసున్న పిల్లల సమగ్రాభివృద్ధి, అప్పుడే పుట్టిన శిశువు నుంచి మూడేళ్ల పిల్లల సమగ్రాభివృద్ధిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. పిల్లల ఎదుగుదల విషయంలో చేపట్టాల్సిన చర్యలను వివరించారు. శిక్షణలో పెందుర్తి మండల సూపర్‌వైజర్లు వి.వి.గీతాలక్ష్మి, డి.మానస, ఎం.లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, జూదం నియంత్రణకు స్పెషల్ డ్రైవ్


స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న పోలీసులు

పెందుర్తి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి సేవించడం, జూదం ఆడటం నేరమని పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి చింతగట్ల, జెర్రిపోతులపాలెం, నరవ శివార్లలో ఓపెన్ డ్రింకింగ్, జూదం, గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకుగురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో సాయంత్రం నుంచి రాత్రి వరకు తనిఖీలు జరిపారు. ప్రజలకు శాంతి భద్రతలు కలిపించే దిశగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐ అసిరితాత పాల్గొన్నారు.

దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన


నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విద్యాధరి, వైద్య సిబ్బంది

సబ్బవరం: దంత సమస్యలకు దూరంగా, నోరు పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉన్నవారిలో ఆత్మ విశ్వాసం మరింత ఎక్కువవుతుందని సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డెంటల్ వైద్యులు డాక్టర్ విద్యాధరి తెలిపారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వరల్డ్ హెల్త్ డేను పురస్కరించుకుని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం నోటి పరిశుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా దంత సమస్యలను దూరం కావడంతోపాటు, నోరు పరిశుభ్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, వెల్ఫేర్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, డాక్టర్ కన్నంనాయుడుతో పాటు గురుకుల పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రసాయన ఎరువులు, పురుగు మందుల్లేని సాగు విధానం.. ప్రకృతి వ్యవసాయం. ఈ విధానంలో వచ్చే పంట ఉత్పత్తులు చాలా ఆరోగ్యకరం. అందుకే ఈ ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ అధికం. సబ్బవరం మండలంలో ఉద్యాన పంటల సాగు ఎక్కువ. కొందరు రైతులు ప్రకృతి సేద్యాన్ని అనుసరిస్తున్నారు. ఇప్పుడు మండలంలోని తవ్వవానిపాలెం గ్రామాన్ని శతశాతం ప్రకృతి సేద్యం గ్రామంగా మార్చేందుకు కలెక్టర్ ఆదేశాలతో ప్రకృతి వ్యవసాయ అధికారులు రంగంలోకి దిగారు.


తవ్వవానిపాలెంలో ప్రకృతి విధానంలో ఉద్యాన పంటల సాగులో రైతు, (ఇన్‌సెట్) ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శత శాతం ప్రకృతి సేద్యం దిశగా.. తవ్వవానిపాలెం


తవ్వవానిపాలెంలో సర్వే నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయంలో పంటలు సాగుచేస్తున్నారు. సబ్బవరం మండలం ప్రధానంగా ఉద్యాన పంటలకు పెట్టింది పేరు. దీంతో మండల కేంద్రం సబ్బవరం పరిసర గ్రామాలైన తవ్వవానిపాలెం, అమృతపురం, పెదనాయుడుపాలెం వంటి గ్రామాల్లో రైతులు కాయగూరల సాగు వైపు అధికంగా మొగ్గు చూపుతున్నారు. ఆయా గ్రామాల్లో ప్రస్తుతం కొందరు రైతులు పాక్షికంగా ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగుచేస్తున్నారు. వీరిని పూర్తి స్థాయిలో ప్రకృతి విధానంలో అవలంబించేలా చేసేందుకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు.

- ప్రస్తుతం పాక్షికంగా ప్రకృతి సేద్యం
- శతశాతం సాగు లక్ష్యంగా అడుగులు
- కలెక్టర్ ఆదేశాలతో రైతు సర్వేలో అధికారులు
- ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన దిగుబడులు

ప్రకృతి సేద్యంతో ప్రయోజనాలు

- ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి ఆరోగ్యంగా ఉంటుంది.
- కృత్రిమ రసాయనాల వినియోగించని కారణంగా వాతావరణం కలుషితం కాదు.
- నీటి యాజమాన్య పద్ధతులతో తక్కువ నీటితోనే పంటల సాగు
- ప్రకృతి సేద్యం ఉత్పత్తులు తినడం వల్ల ఆరోగ్య సంరక్షణ కూడా సాధ్యం.
- పెట్టుబడులు తగ్గడంతోపాటు, పంట దిగుబడులు కూడా పెరుగుతాయి.
- ప్రకృతి సాగు ఉత్పత్తులకు నిల్వ సామర్థ్యం అధికం.
- ఈ పద్ధతిలో పంటల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం లభిస్తుంది.

తవ్వవానిపాలెం సాగు వివరాలు
పంటల సాగు విస్తీర్ణం 256 ఎకరాలు
సాగు చేస్తున్న రైతులు 282 మంది
ప్రకృతి సేద్యం విస్తీర్ణం 42 ఎకరాలు
ప్రకృతి సేద్యం రైతులు 62 మంది

శత శాతం సాగు లక్ష్యంగా..

తవ్వవానిపాలెం గ్రామాన్ని శత శాతం ప్రకృతి వ్యవసాయ సాగు గ్రామంగా తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి రైతు సర్వే చేస్తున్నారు. ఇప్పటికే 80 శాతం సర్వే పూర్తికావస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయం సిబ్బంది చెప్తున్నారు. ప్రస్తుతం పాక్షికంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు.. శత శాతం అనుసరించేలా అవగాహన కల్పిస్తున్నారు.

సొంతంగానే ఎరువులు, పురుగు మందులు

రైతులకు అందుబాటులో ఉండే వనరులను సద్వినియోగం చేసుకుని ఎరువులు, క్రిమి సంహారక మందుల్ని సొంతంగా తయారు చేసుకుంటున్నారు. ఆవు పేడ, గో మూత్రం, శనగపిండి, బెల్లం, పుట్టమన్ను వంటి వాటితో ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారుచేసి ఎరువుగా వాడతారు. పురుగులు, తెగుళ్ల నివారణకు నియమాస్త్రం, బ్రహ్మాస్త్రం, దశవర్ణి కషాయం, అగ్నిఅస్త్రం, జిల్లేడు ద్రావణం వంటివి రైతులే తయారు చేసుకుంటున్నారు. దీంతో చాలా వరకు పెట్టుబడి భారం తగ్గుతుంది.

తెగుళ్ల బెడద లేదు



మాకు గ్రామంలో 3.50 ఎకరాల భూమి ఉంది. ఇందులో పల్లం రెండెకరాలు, మెట్టు 1.50 ఎకరాలు ఉంది. మెట్టు 40 సెంట్లలో ప్రకృతి సాగు ఏటీఎం పద్ధతిలో ఆనబ, వంగ, బెండ, టమాటా, ఉల్లి, ఆకుకూరలు, మొక్కజొన్న, అరటి, మిరప, బొప్పాయి వంటి పంటలను వేసుకున్నాం. ఈ పద్ధతిలో పంటలకు తెగుళ్ల బెడద లేదు. సొంత వినియోగం పోగా, చుట్టు పక్కల నుంచి టీచర్లు, ఉద్యోగులు కొనుక్కుని తీసుకెళ్తున్నారు.
– రెడ్డి అప్పలనాయుడు, రైతు, తవ్వవానిపాలెం

ఉద్యాన పంటల సాగుకు సన్నద్ధం



మాకు గ్రామంలో సుమారు 1.80 ఎకరాల సాగు భూమి ఉంది. 80 సెంట్ల భూమిలో సాంప్రదాయ పద్ధతిలో ఉద్యాన పంటలైన కాయగూరలు సాగు చేస్తాను. మిగిలిన భూమిలో మినుములు, నువ్వులు, పెసలు వంటి పంటలను సాగు చేస్తాను. మా గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు అధిక డిమాండ్ ఉంది. కొంత విస్తీర్ణంలో ఈ పద్ధతిలో ఉద్యాన పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నాను.
– బోకం శ్రీనివాసరావు, రైతు, తవ్వవానిపాలెం

ప్రకృతి సాగుపై రైతుల ఆసక్తి



ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. తవ్వవానిపాలెంలో శత శాతం ప్రకృతి సేద్యం జరిగేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. ఈ విధానంలో పండించే పంటలకు అధిక డిమాండ్ ఉంటుంది. మార్కెట్‌లో రెండింతల ధర ఇచ్చి కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ముందుకు వస్తున్నారు. గ్రామంలో రైతు సర్వే నిర్వహిస్తున్నాం. ఇప్పటికే 80 శాతం సర్వే పూర్తయింది.
– జి.శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయం ఎంసీఆర్పీ, సబ్బవరం మండలం

మహిళల స్వయం ఉపాధికి రాంకీ ఫౌండేషన్ సహకారం


శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్

పరవాడ: రెడీమేడ్ గార్మెంట్స్ తయారీలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు ముందుకు వస్తే, సాంకేతిక సహకారం అందించేందుకు రాంకీ ఫౌండేషన్ సిద్ధంగా ఉందని ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్ తెలిపారు. రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో స్థానిక సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెడీమేడ్ గార్మెంట్స్ మేకింగ్‌పై నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న 60 మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు ముందుకొస్తే సాంకేతిక, ఆర్థిక సహకారం అందించేందుకు ఫౌండేషన్ సిద్ధంగా ఉందన్నారు. శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. సాధన స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పైల గోపాలకృష్ణ, కోఆర్డినేటర్ డి.నాగమణి, కోశాధికారి కె.బి.కన్నారావు, డి.లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా పరదేశిమాంబ ఆలయ వార్షికోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న కొటాన రాము తదితరులు


ఆకట్టుకున్న కోలాటం పోటీలు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెంలో కొలువైన పరదేశిమాంబ అమ్మవారి ఆలయ మొదటి వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. పెదనాయుడుపాలెం పోతలవారి కళ్లాలవారు అమ్మవారి సారెను పెద్ద ఊరేగింపుగా తీసుకొచ్చారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మహిళా కోలాటం పోటీలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆలయాన్ని పూలమాలలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ కొటాన అప్పారావు, ఎంపీటీసీ బైలపూడి దేముడు, ఆదిరెడ్డి రమణ, గొర్లి కనకం, కొటాన కోటయ్య, ఆదిరెడ్డి పోతురాజు, మద్దు సూర్యనారాయణ తదితరులున్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న 8వ అదనపు జిల్లా జడ్జి కవిత

పెదగంట్యాడ: మహిళలు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని 8వ అదనపు జిల్లా జడ్జి కవిత అన్నారు. గాజువాక మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలు, బాలికల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో మహిళలపై వేధింపులు, దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పరిస్థితులు, సామాజిక సమస్యలపై అవగాహన లోపం వీటికి ప్రధాన కారణమన్నారు. చట్టాలను కఠినంగా అమలు చేసేందుకు ప్రభుత్వాలు, కోర్టులు, పోలీసులు ముందుండాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై ఆడ పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాలికలు, మహిళలు దైనందిన కార్యకలాపాల్లో ఎదుర్కొంటున్న వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం మాలతి, ఉపాధ్యాయుడు రాజారావు, సోషల్ వర్కర్ వినోద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు, ఈవో


నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు పూజలో పాల్గొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

పిచ్చుకల సంరక్షణతో పర్యావరణ సమతుల్యత


చెట్లకు పిచ్చుకల గూళ్లు, ఆహార ధాన్యాలను వేలాడదీస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి

సబ్బవరం: పిచ్చుకలు మానవ మనుగడకు ఆధారమని, వాటి సంరక్షణ మనందరి బాధ్యత కావాలని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పిచ్చుకల సంరక్షణపై కళాశాల విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. పిచ్చుకల జాతి తగ్గిపోతున్న పరిస్థితుల్లో వాటిని ఎలా సంరక్షించాలి, వాటికి ఆవాసాల ఏర్పాటు, పెంచే పద్ధతులను వివరించారు. కళాశాల వాణిజ్యశాస్త్ర అధ్యాపకుడు గోవిందరావు స్వచ్ఛంద పిచ్చుకల సంరక్షణ ఉద్యమకారుడిగా వివిధ రకాల పిచ్చుక గూళ్లను, ఆహార ధాన్యాలను విద్యార్థులకు చూపి, సంరక్షణ నైపుణ్యాలను వివరించారు. పక్షుల సంరక్షణ ద్వారా పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలోని చెట్లకు పిచ్చుక గూళ్లను ఏర్పాటు చేసి, ఆహార ధాన్యాలను అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, అధ్యాపకులు గణేష్, లక్ష్మి, గోపాలకృష్ణ, రామకృష్ణ, రత్నప్రకాష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపులో కూటమి విఫలం


తహసీల్దార్ అమలకు దరఖాస్తులు అందజేస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి విమర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో పేదల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పెదగంట్యాడ తహసీల్దార్ అమలకు గురువారం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా ఇంతవరకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించగా వందలాది పేద కుటుంబాలు అందజేశాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి నెల రోజుల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, పి. చంద్రశేఖర్, ఎ.విమల పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో వైఎస్సార్ గుర్తులు చెరగనివి


మాట్లాడుతున్న గండి రవికుమార్

సబ్బవరం: బోర్డులపై పేర్లు తొలగించినంత మాత్రాన ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత మహానేత వైఎస్సార్ గురుతుల్ని తొలగించలేరని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ అన్నారు. మండలంలోని మొగలిపురంలో ఉన్న తన నివాసంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖలోని పీఎం పాలెంలో ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి ఉన్న వైఎస్సార్ పేరు తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పిలుపు మేరకు స్టేడియం వద్ద నిరసన తెలిపామన్నారు. ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో అట్టడుగు వర్గాల నుంచి అత్యున్నత వర్గాల వరకు ప్రతి ఒక్కరి మదిలో వైఎస్సార్ చిరస్మరణీయుడన్నారు. అలాంటి వ్యక్తి పేరును బోర్డులపై తొలగించగలరు తప్ప, ప్రజల హృదయాల నుంచి తొలగించగలమనుకోవడం కూటమి నేతల భ్రమ అని ఆక్షేపించారు. ఇప్పటికైనా ఇలాంటి చిల్లర పనులు మాని, పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు.

గొర్లివానిపాలెంలో అగ్నిప్రమాదం

- కాలి బూడిదైన పశువుల పాకలు, గడ్డివాములు, తోటలు
- సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం



అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన పశువుల పాకలు, మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సబ్బవరం: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు గొర్లివానిపాలెంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో పశువుల పాకలు, గడ్డివాములు, సరుగుడు, టేకు, నీలగిరి, మామిడి తోటలు దగ్ధమవడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి, మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి ఆకతాయిలు తాగి పడేసిన సిగరెట్ కారణమని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. కొందరు యువకులు ఇటీవలి కాలం నుంచి ఇక్కడ మద్యం సేవిస్తూ, సిగరెట్లు తాగుతూ గంటల తరబడి కూర్చుంటున్నారని పేర్కొన్నారు. తొలుత టేకు, సరుగుడు తోటల మీదుగా వచ్చిన అగ్నికీలలు గడ్డివాములు, పశువుల పాకలపై పడి విస్తరించి ఉంటాయని చెప్తున్నారు.

దీంతో 4-5 ఎకరాల్లో తోటలు దగ్ధమయ్యాయి. మధ్యాహ్న సమయంలో జరగడంతో రైతులంతా ఇళ్ల వద్దనే ఉన్నారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే చేరుకున్నారు. అప్పటికే భారీ మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక విభాగానికి సమాచారం అందించడంతో వారు వచ్చి, మంటల్ని అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో గొర్లి నరసింహరెడ్డి, గొర్లి అప్పలనాయుడు, గొర్లి రమణ, గొర్లి సత్యనారాయణ, గొర్లి నీలేశ్వరరావు, కొటాన దేముడు, గండి బంగారయ్య, కొల్లి కృష్ణ తదితరులకు చెందిన ఆస్తులకు నష్టం వాటిల్లింది. విశాఖలోని మర్రిపాలెం ఫైర్ స్టేషన్ సహాయ అధికారి చిరంజీవి మాట్లాడుతూ రైతులకు సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా వేశారు. వేసవిలో అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.